క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



ప్రమాద స్థలంలో పడి ఉన్న ఆటోలు

శంఖవరం: మండలంలోని పి.మల్లాపురం శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... అడ్డతీగల గ్రామానికి చెందిన పలువురు బంధువుల ఇంటిలో శుభకార్యం నిమిత్తం పి.మల్లాపురం వచ్చారు. కార్యక్రమం ముగించుకుని అడ్డతీగలకు తిరుగు ప్రయాణమయ్యారు. గ్రామ శివారులో వారు వెళుతున్న ఆటోను మరో ఆటో ఢీకొట్టింది. ఒక్కొక్క ఆటో సుమారు 10 మంది ప్రయాణం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు కాగా వారిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

హైందవ శంఖారావంపై ఇంటింటా ప్రచారం

ఏలేశ్వరం: విజయవాడలో ఈ నెల 5న నిర్వహించే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరుతూ చిన్నింపేటలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ఆలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించి ఉత్తమ ధార్మిక సంస్థలకు అప్పగించాలన్నారు. హైందవ శంఖారావానికి ప్రజలు వేలాదిగా తరలివచ్చి హిందూ ఐక్యత చాటాలన్నారు. అనంతరం శంఖారావం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు యల్లపు సూర్యనారాయణ, దాడి అప్పాజీ, రాణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నేత అరెస్టుకు నిరసనగా ఆందోళన



ఏలేశ్వరంలో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం: మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా సీఐటీయూ నేత ఆర్.ఈశ్వరరావు అరెస్టు నిరసిస్తూ పట్టణంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీచౌక్ వద్ద ప్రధాన రహదారిపై కార్మికులు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ జీడిపిక్కల ఫ్యాక్టరీ మూసివేతతో 409 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. అరెస్టులకు భయపడేది లేదన్నారు. యాజమాన్యం వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు

కానిస్టేబుల్‌ను ఢీకొట్టి పరార్

కిర్లంపూడి: మండలంలోని సోమవరం టోల్ ప్లాజా సమీపంలో మంగళవారం రాత్రి పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లోవరాజును గుర్తు తెలియని వ్యక్తి కారుతో ఢీకొట్టి పరారైనట్టు సమాచారం. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ లోవరాజుకు స్వల్ప గాయాలు అవ్వడంతో కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిసింది. కాగా ఆ కారులో గంజాయి తరలిస్తున్నట్టు అనుమానిస్తున్నారు.

రిక్షా కార్మికులకు దుప్పట్ల పంపిణీ



ప్రత్తిపాడులో రిక్షా కార్మికులకు దుప్పట్లు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోహన్

ప్రత్తిపాడు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ సభ్యులు బుధవారం రిక్షా కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అరకు గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కొల్లాబత్తుల వేణుగోపాల్ సమకూర్చిన దుప్పట్లను ప్రత్తిపాడులో రిక్షా కార్మికులకు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు, ఇంజినీర్ మోహన్ అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు ఏడిద రెడ్డినాయుడు, పిల్లా పద్మరాజు, కె.సంజీవరావు, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

రౌతులపూడి: మండలంలోని గిడజాంలో కృపా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బండారు భైరాగి ఆధ్వర్యంలో బుధవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా గ్రామంలోని వితంతువులకు దుస్తులు అందజేశారు. తొలులు హోలీ లైట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన క్రీస్తు సందేశాన్ని అందించారు. ఏటా పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏసు క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

తాండవ బ్రిడ్జికి మోక్షమెప్పుడో?

- పది నెలలుగా నిలిచిన నిర్మాణ పనులు
- 50 గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



కోటనందూరులో అసంపూర్తిగా నిలిచిపోయిన తాండవబ్రిడ్జి నిర్మాణ పనులు

కోటనందూరు: తాండవ నదిపై కోటనందూరులో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా తుపానులు, వరదల సమయంలో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. తాండవ నది పరివాహక ప్రాంతంలో భారీగా వర్షం కురిసినా, తాండవ జలాశయం నుంచి నది ద్వారా సముద్రానికి నీటిని విడిచిపెట్టినా కోటనందూరులో కాజ్‌వే (బ్రిడ్జి)పై నుంచి నీరు ప్రవహించి ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ఫలితంగా ఈ బ్రిడ్జి ఆధారంగా ప్రయాణించే 50 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

కాజ్‌వే శిథిలం

తుని–నర్సీపట్నం రోడ్డు నుంచి కోటనందూరు గ్రామానికి చేరుకోవాలంటే మధ్యలో ఉన్న తాండవ నదిని దాటాల్సి ఉంది. 1976లో నిర్మించిన ఈ కాజ్‌వే పైభాగం శిథిలం కావడం, ఇరుపక్కలా రక్షణ లేకపోవడం, ఎత్తు, వెడల్పు, కింద ఫిల్లర్ల మధ్య దూరం తక్కువగా ఉండడం వంటి కారణాలతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. వరదల సమయంలో నదిలో నీరు కాజ్‌వే పైనుంచి ఉధృతంగా ప్రవహించి తుని–నర్సీపట్నం రోడ్డుకు, కోటనందూరు గ్రామానికి పూర్తిగా సంబంధాలు తెగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కాజ్‌వేను బ్రిడ్జిగా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో నిధుల మంజూరు

నియోజకవర్గ ప్రజల ఐదు దశాబ్దాల కలగా మారిన ఈ బ్రిడ్జి నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. గత మార్చి వరకూ శరవేగంగా సాగిన పనులకు ఎన్నికల కోడ్‌తో అంతరాయం ఏర్పడింది. కొత్త ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణాన్ని పట్టించుకోలేదు. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం లేనందున అధికార యంత్రాంగం, పాలకులు స్పందించి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అన్ని రకాలుగా అభివృద్ధి

కోటనందూరులో తాండవ నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలతో పాటు ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. కోటనందూరులో తుని–నర్సీపట్నం రోడ్డు నుంచి పాత కొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, రౌతులపూడి, శంఖవరం మీదుగా కత్తిపూడి వద్ద 216 నంబర్ హైవేకు చేరుకునేందుకు 33 కిలోమీటర్ల పొడవ గల రోడ్డు ఉంది. కోటనందూరులో తాండవ నదిపై సరైన బ్రిడ్జి లేకపోవడంతో ఈ మార్గంలో భారీ వాహనాలు తిరిగే అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా ఈ రోడ్డు లూప్‌లైన్‌గానే మిగిలిపోయింది. ఇక్కడ ఉన్న కాజ్‌వే బ్రిడ్జిగా అభివృద్ధి చెందితే సౌకర్యవంతమైన ప్రయాణంతో పాటు రోడ్లు, వ్యాపార అవకాశాలు మెరుగుపడతాయి. ఈ ప్రాంతం ఆర్థికంగా, సామాజికంగా పురోగతి సాధిస్తుంది.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి



తాండవ నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలతో పాటు ఈ ప్రాంతం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుంది. వరదలు, అత్యవసర సమయాల్లో కూడా ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోజుల తరబడి నీరు ఇప్పుడున్న బ్రిడ్జిపై నుంచి ప్రవహించింది. రాకపోకలకు ఎన్నో అవస్థలు పడ్డాం. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి.

అయిల వీరబాబు, కోటనందూరు

17న షెడ్యూల్ కులాల తుది జాబితా ప్రచురణ

ప్రత్తిపాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్ కులాల తుది జాబితాను ఈ నెల 17న ప్రచురిస్తామని ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం.సూర్యప్రభ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సామాజిక తనిఖీ నిర్వహించి, అభ్యంతరాలు తెలుసుకునేందుకు గత నెల 26న జాబితాలను ప్రచురణ చేశామన్నారు. ఈ జాబితాలపై అభ్యంతరాలుంటే ఈ నెల 7వ తేదీ లోపు గ్రామ రెవెన్యూ అధికారికి తెలియజేయాలని సూచించారు. ఈ నివేదికపై ఎటువంటి అభ్యంతరాలు రాకపోతే 17వ తేదీన తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు.

రేపు మంగళగిరిలో మాజీ సైనికుల సమావేశం



రమేష్

కోటనందూరు: మంగళగిరిలో ఈ నెల శుక్రవారం మాజీ సైనికుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ సెక్రటరీ వై.రమేష్‌కుమార్ కోరారు. కోటనందూరులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మాజీ సైనికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మాజీ సైనికుల అసోసియేషన్ ప్రతినిధులందరూ ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైభవంగా మహాకుంభాభిషేకం



తామరాడలో కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

కిర్లంపూడి: మండలంలోని తామరాడలో వేంచేసిన కనకదుర్గమ్మ అమ్మవారికి బుధవారం మహా కుంభాభిషేకం నిర్వహించారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గ్రామానికి చెందిన మహిళలు పవిత్ర జలాలతో నింపిన కలశాలను శిరస్సున ధరించి గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పవిత్ర జలాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువెళ్లగా అర్చకులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి అభిషేకించారు. అనంతరం ఆలయ వద్ద ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తుని: ఆంధ్రప్రదేశ్ తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం టీఎన్‌యూఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ సభ్యులు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్యలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఉభయ గోదావరి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ కేఎస్ఎన్, హెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా ట్రెజరర్ టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయానికి వీఐపీల తాకిడి

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు



రత్నగిరిపై బొత్స సత్యనారాయణ దంపతులకు స్వాగతం పలుకుతున్న దేవస్థానం ఈఓ సుబ్బారావు



ఎస్.అన్నవరంలో స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం పలువురు ప్రముఖులు రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. రాష్ట్ర శాసనమండలిలో ప్రతిపక్షనేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆయనకు ఆలయం వద్ద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ వి.సుబ్బారావు అందచేశారు. అలాగే టీటీడీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం, ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు కుటుంబ సభ్యులతో కలిసి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు.

సత్యదేవుని దర్శించిన ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

ప్రముఖ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు సతీసమేతంగా రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు. స్వామివారి ప్రసాదాలను దేవస్థానం అధికారులు బహూకరించారు. కాగా సత్యదేవుని వైభవంపై ప్రవచనాలు చెప్పాలని దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు ఆయనను కోరారు. ఫిబ్రవరి వరకూ ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉన్నందున ఆ తరువాత అన్నవరంలో ప్రవచనాలు చెబుతానని చాగంటి తెలిపారు.

తుని రూరల్: ధనుర్మాసం, ఆంగ్ల సంవత్సరం మొదట రోజు కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ఎస్.అన్నవరంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, ఎన్.సూరవరంలో వేంకటేశ్వరస్వామి, టి.తిమ్మాపురంలో మహావిష్ణు ఆలయం, డి.పోలవరం, హంసవరం, తేటగుంట, వి.కొత్తూరులో రామాలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎస్.అన్నవరంలో స్వామివారికి వివిధ రకాల పూలతో పూలంగి సేవ, శ్రీపుష్పయాగం వైభవంగా నిర్వహించారు.

చర్చిల్లో ప్రార్థనలు

తొండంగి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం మండల పరిధిలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అర్ధరాత్రి కొవ్వొత్తులతో ప్రార్థనలు చేశారు. గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోకవరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే గోకవరంలోని దేవీచౌక్ ఆలయం, రమాసత్యనారాయణ స్వామి ఆలయం, గుమ్మళ్లదొడ్డిలో సుందరగిరిపై వేంచేసిన భద్రాద్రి సీతారామ సహిత రమాసత్యనారాయణ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ధర్మవరంలో వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజును గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు



శంఖవరంలో ఎంపీపీ పర్వత రాజుబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు



ఏలేశ్వరంలో వైఎస్సార్ సీపీ నేత సూర్యకుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



తునిలో వైఎస్సార్ సీపీ నేత యనమల శివరాక్రిష్ణన్‌ను పూలమాలతో సత్కరిస్తున్న నాయకులు

కోటి ఆశలతో న్యూ ఇయర్‌కు స్వాగతం

- వైభవంగా నూతన సంవత్సర వేడుకలు
- ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షల వెల్లువ

ఏలేశ్వరం/శంఖవరం/తుని/తుని రూరల్/కొటనందూరు/జగ్గంపేట/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/గండేపల్లి/తొండంగి/గోకవరం: తమ జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుతూ నూతన సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో బుధవారం న్యూ ఇయర్ వేడుకలు కన్నులపండువగా జరిగాయి. ఉదయం నుంచి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకొంటూ స్వీట్లు, పండ్లు, బొకేలు ఇచ్చుకుంటూ ఉత్సాహంగా గడిపారు. విద్యార్థులు గ్రీటింగ్స్ కార్డ్స్ పంపిణీ చేశారు. గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుకు శుభాకాంక్షలు చేప్పేందుకు ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వేలాదిగా ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీశ్రేణులు కిర్లంపూడి తరలివెళ్లారు. ఏలేశ్వరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైస్‌చైర్‌పర్సన్ శిడగం త్రివేణి, మున్సిపల్ కౌన్సిలర్లు సామంతుల హైమావతి, మూదినారాయణస్వామి, బొదిరెడ్డిగోపి, ఇంటి వద్ద వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పైల విజయ్‌కుమార్, పతివాడ జగదీష్ తదితరులు పాల్గొన్నారు. పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఇంటి వద్ద వేడుకలు నిర్వహించారు. శంఖవరం మండలంలో ఎంపీపీ పర్వత రాజుబాబు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.



ముద్రగడ గిరిబాబును గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు



జగ్గంపేటలో మాజీ ఎమ్మెల్యే చంటిబాబును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

తుని, కొటనందూరు మండలాల్లో..

తుని పట్టణంలో వైఎస్సార్ సీపీ యువనేత యనమల శివరామకృష్ణన్‌ను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తుని మండలంలోని ఎస్.అన్నవరం శివారు సాయి వేదికలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృషుడిని పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తుని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, ఎంపీడీఓ కె.సాయి నవీన్, రెవెన్యూ కార్యాయలంలో తహసీల్దార్ ప్రసాద్‌ను ఆయా కార్యాలయ సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు. కోటనందూరు పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు కేక్ కట్ చేసి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో...

జగ్గంపేటలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ నేతలు,అభిమానులు, కార్యకర్తలు ఆయనను గజమాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు నియోజకవర్గ నలుమూలల నుంచి తరలి వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు అభిమానులు నూతన శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు ఒమ్మి రఘురాం, జగ్గంపేట జెడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి ఆధ్వర్యంలో వివేకనంద స్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. గండేపల్లి మండలంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణకు ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్తిపాడు, తొండంగి మండలాల్లో...

ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గ నలుమూలల నుంచి భారీ ఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి మురళీరాజుకు బుకేలు, పూలమాలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మురళీరాజు భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. భారీ జనసందోహంతో ఆయన ఇంటికి వెళ్లే దారులన్నీ కిక్కిరిసిపోయి ట్రాఫిక్ స్తంభించింది. కార్యక్రమంలో పార్టీ పిఠాపురం నియోజకవర్గ పరిశీలకుడు గౌతు నాగు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సాయి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పులి మధు, పార్టీ నాయకులు శిగడం వెంకటేశ్వరరావు, శాలివాహన మాజీ డైరెక్టర్ అనకాపల్లి నూకరాజు, రాపర్తి రామకృష్ణ, బీశెట్టి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రత్తిపాడులోని టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను నియోజకవర్గంలోని ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్తిపాడులో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు వైభవంగా జరిగాయి. పెదశంకర్లపూడిలో వైఎస్సార్ సీపీ నాయకుడు దోశ చిట్టిబాబు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పార్టీ శ్రేణులు కారు, ఆటో, బైక్‌ల ర్యాలీ నిర్వహించారు. తొండంగి మండలంలోని న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి.

గోకవరం మండలంలో..

గోకవరం మండలంలో నూతన సంవత్సర వేడుకలు వైభవంగా జరిగాయి. అర్ధరాత్రి వరకు చిన్నా, పెద్దా సందడి చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మహిళలు రంగవల్లులు వేస్తూ సందడి చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గోకవరం ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది గస్తీ నిర్వహించారు. మండలంలోని ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఆయా పార్టీల నాయకులు, పలువురు అధికారులు ప్రజాప్రతినిధులకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

ముద్రగడ ఇంటి వద్ద సందడి

కిర్లంపూడి: జై జగన్, జై ముద్రగడ నినాదాలతో కిర్లంపూడిలోని ముద్రగడ ఇంటి పరిసరాలు మార్మోగాయి. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి, యువనాయకుడు ముద్రగడ గిరిబాబును కలిసేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కిర్లంపూడి తరలివచ్చారు. తమకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన ప్రతిఒక్కరినీ ముద్రగడ పేరుపేరున ఆప్యాయంగా పలకరించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి యువనాయకుడు గిరిబాబును శాలువా, పుష్పగుచ్చం, గజమాలలతో సత్కరించారు. తొలిత గిరిబాబు పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ముద్రగడను కలిసేందుకు వచ్చిన వాహనాలతో కిర్లంపూడి ప్రధాన రహదారి కిక్కిరిసిపోయింది. అలాగే కిర్లంపూడిలో ఎంపీపీ తోట రవి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.



కిర్లంపూడిలో ముద్రగడకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు